ప్రజాశక్తి
మంగళవారం 6 డిసెంబర్ 2022 5
శ్రీ సత్యసాయి





కర్నూలు జిల్లాలో జరిగిన రాయలసీమ గర్జనలో ప్రసంగిస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్



కాలుష్య వలయం..!

బంగారాన్ని పండించే పంట పొలాలను అభివృద్ధి పేరుతో పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వాలు సేకరించాయి. రాజకీయ అండదండలున్న బడాపారిశ్రామిక వేత్తలకు వీటిని అప్పగించారు. ఇలా హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడలో పలు రసాయన పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. ఈ రసాయన పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థలతో సమీప గ్రామ ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. ఉన్న కొద్దిపాటి పంట పొలాలు కూడా నిర్జీవం అవుతున్నాయి. పరిశ్రమ యాజమాన్యం యథేచ్ఛగా వ్యర్థాలను మురుగుకాలువల్లో పడేస్తోంది. దీనిని నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు నామమాత్రపు చర్యలకే పరిమితం అవుతున్నారు.

- జనావాసాల మధ్య రసాయనాల పారివేత
- 'పురం' పారిశ్రామిక వాడ, సమీప గ్రామాల ప్రజలపై ప్రభావం
- పంట కాలుష్యం.. రోగాల బారిన జనం..
- నామమాత్రంగా అధికారుల చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తూముకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడతోపాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలు కాలుష్యపు కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలు కాలుష్యం దెబ్బతో శ్వాసకోస, చర్మవ్యాధుల రోగాలబారిన పడుతున్నారు. కెమికల్, స్టీల్ పరిశ్రమలు వెదజల్లే పొగ, దుర్వాసనకు పారిశ్రామికవాడ పరిధిలోని గోళ్లాపురం, గుడ్డంపల్లి, దేవరపల్లి, తదితర గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే పొగలు మేఘాలను తలపిస్తుంటాయి. దట్టమైన పొగలతో కనీసం వాహనాలు నడుపడానికి సైతం ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. పారిశ్రామిక వాడలో మనస్వీ. వరహాయి తదితర రసయాన పరిశ్రమలున్నాయి. ఇలాంటి పరిశ్రమలు వ్యర్థాలను సమీప భూముల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. దీంతో భూ గర్భజలాలు సైతం కలుషితమవుతున్నాయి. రసాయనాల మోతాదు పెరగడంతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఇక రైతులు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. భూమిలో సారం తగ్గిపోయి పంటలు పండడం లేదు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న తప్పా మరే ఇతర పంట సాగు చేసుకోలేని పరిస్థితికి వచ్చేసింది. ఇటీవల ఇందులో సైతం దిగుబడి తక్కువగా వస్తోంది. పురం ప్రాంతానికి అతిపెద్ద ఆధారంగా నిలిచిన పట్టుపరిశ్రమ కాలుష్యం దెబ్బతో చితికిపోయింది. స్థానికులకు ఇటు పరిశ్రమల్లో ఉపాధి లభించక అటు తమకు ఉన్న భూముల్లో పంటలు వేసుకోలేక రెండు విధాలుగానూ నష్టపోయారు. రసయాన వ్యర్థలను పట్టణంలోని కొటిపి రోడ్డు రైల్వే ట్రాక్ పక్కన వేయడంతో అక్కడ ఉన్న చెట్లు ఎండిపోయాయి. ఆ దారి వెంటే వెళ్తే భరించలేని దుర్వాసన వస్తోంది.

భూమిపైనే రసాయన వ్యర్థాలు

తూముకుంట,గోళ్లపురం పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన ఉక్కు, రసాయన పరిశ్రమల నుంచి వెలువడే విషవాయును పీల్చడం ఒక కష్టం అయితే పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థలను చుట్టు పక్కల పారివేస్తుండడం అదనపు కష్టంగా మారింది. సాధారణంగా వ్యర్థాలను సుమారు 50 అడుగుల భూమిలోపల వేసి పూడ్చాలి. అయితే ప్రజాప్రతినిదులే ఏజెంట్లుగా మారి పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాన్ని ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు చేసి జన నివాసం లేరన్న సాకుతో పొలాల మధ్య వేస్తున్నారు. ఈ రసాయనాలు పడిచన చోట కనీసం ఒక పిచ్చి మొక్క కూడా మొలవదు. ఇది చాలదన్నట్లు ఇటీవల కురిసిన వర్షాలకు రసాయన పరిశ్రమల నిర్వహకులు వారి పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలను చిన్న కాలువలు చేసి బయటకు వదులుతున్నారు. ఇవి వర్షపు నీటిలో కలిసి ఎపిఐఐసి కార్యాలయం ముందు చిన్నచెరువులా నిలిచిపోయింది. ఈ ప్రాంతం వద్దకెళ్తే రసాయనాల దుర్వాసనతో ఊపిరాడని పరిస్థితి ఉంటుంది. ఇక్కడ భూగర్భ జలాలు సైతం కలుషితం అయిన పరిస్థితి కన్పిస్తోంది. పరిస్థితి ఇంత భయానంగా ఉన్నా కాలుష్య నియంత్రణ, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదు.



రసాయన వ్యర్థాలను ప్రత్యేక ట్యాంకర్ ద్వారా బయటకు వదులుతున్న పరిశ్రమ సిబ్బంది

నిబంధనలు ఇవే.....

రసాయన, స్టీల్ పరిశ్రమల యాజయాన్యలు కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు వారి పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలను వారి పరిశ్రమ ప్రాంగణంలో నిలువ చేసి శుద్ధి చేయాలి. ఘన వ్యర్థలను నిలువ చేసి జనసంచారం లేని, నివాసాలకు దూరంగా సుమారు 50 అడుగుల లోతు వ్యర్థలను వేసి దానిపై మట్టి వేసి పూడ్చాల్సి ఉంది. దీంతో పాటు కాలుష్య మండలి నిబంధనలు పాటించాలి. అయితే పురం పారిశ్రామిక వాడిలో ఇలాంటివేవీ అమలుకానట్లు తెలుస్తోంది.

అధికారులు స్పందించాలి

తూముకుంట పారిశ్రామికవాడలో ఉన్న పరిశ్రమల వల్ల పర్యావరణం దెబ్బ తిని కాలుష్యం నెలకొంది. దీంతో పారిశ్రామికవాడ చుట్టు పక్కల ఉన్న గ్రామలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని కొట్టిమిట్టాడుతున్నాయి. కాలుష్య నియంత్రణ అధికారుల బృందం పర్యటించి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి. రసాయనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు. ఇప్పటికైనా తూముకుంట పారిశ్రామికవాడలో అధికారులు పర్యటించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

ఎం.ఇంతియాజ్, సిపిఎం జిల్లా కార్యదర్శి..

జాడలేని సమగ్రాభివృద్ధి

- సాగునీటి పథకాలపై చిత్తశుద్ధి కరువు
- పరిశ్రమల ఏర్పాటు మాటలకే పరిమితం
- ప్రణాళిక లేని గర్జనపై విమర్శలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయలసీమ వెనుకబాటుతనంపై ఇప్పుడు పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గర్జన పేరుతో అధికారపార్టీ కర్నూలు చేపట్టిన సభతో ఇక్కడి అభివృద్ధిపైనా చర్చ జరుగుతోంది. అత్యంత వెనుకబడిన ప్రాంతాభివృద్ధిపై అనేక ఏళ్లుగా ఇదే రకమైన చర్చలు సాగుతూనే ఉన్నాయి. సాగునీరు, పరిశ్రమల ఏర్పాటు జరగాలని అనేక ఉద్యమాలు సైతం నడిచాయి. అయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 27 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో రెండు లక్షల ఎకరాల్లోపే నీటి వసతి ఉంటోంది. పది శాతంలోపే నీటి వసతి ఉంది. జిల్లా సాగు, పారిశ్రామిక అవసరాలు అన్నీ తీరాలంటే కనీసం 120 టిఎంసిల వరకైనా నీటి సౌకర్యం ఉండాలని సాగునీటి నిపుణులు సైతం అంచనా వేశారు. దీనికోసమే హంద్రీనీవా ప్రాజెక్టును మరింత విస్తరించాలని డిమాండ్ వస్తోంది. అదే సమయంలో అంతకు ముందున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద 42 టిఎంసిలు తీసుకోవాల్సిన చోట 25 టిఎంసిల నుంచి గరిష్టంగా 30 టిఎంసిల్లోపే తీసుకోగలుగుతున్నాం. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులను పూర్తిగా రద్దు చేసింది. దీంతో ఏటా నిర్వహణే గగనంగా మారుతోందని జలవనరుల శాఖ అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయినా నిధుల కేటాయింపులు జరగలేదు. హంద్రీనీవా ద్వారా 30 టిఎంసిల వరకు తీసుకోగలుగుతున్నా, దీన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. ప్రభుత్వమూ ఆరు వేల క్యూసెక్కులకు ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతామని ప్రకటించింది. అయితే ఇప్పటికీ పనులు ప్రారంభమవలేదు. ప్రధాన ప్రాజెక్టులు పూర్తయ్యి అదనంగా నీరు రాకుండా ఈప్రాంతాభివృద్ధి ఎలా సాధ్యమన్న ప్రశ్న జిల్లావాసుల నుంచి వ్యక్తమవుతోంది.

పడకేసిన పారిశ్రామికాభివృద్ధి

జిల్లా అభివృద్ధి కోసం పారిశ్రామికంగా అనేక హామీలను ప్రభుత్వాలిచ్చాయి. గడిచిన ఐదారు దశాబ్ధాల్లో వచ్చిన ఒకేఒక పెద్ద పరిశ్రమ కియా కార్ల తయారీ పరిశ్రమ. అది మినహా కొత్తగా ఒక్క పరిశ్రమారాలేదు. వస్తుందనుకున్న జాకీ పరిశ్రమ నాయకుల బెదిరింపులతో అడుగుమోపకుండానే వెనుదిరిగిపోయింది. ఇప్పుడు ఆ పాపం ఒకరిపై ఒకరు నెట్టుకునే ప్రయత్నాలను అధికార, ప్రతిపక్షాలు చేస్తున్నాయి. తెరిపిస్తామని హామీనిచ్చిన్న గుంతకల్లు స్పిన్నింగు మిల్లు గేటు ద్వారాలు సైతం తెరచుకోలేదు. ఇక బంగారు గనులు తిరిగి ప్రారంభిస్తామని ఇప్పటికీ రోజుకొక ప్రకటన వెలువడుతూనే ఉంది. కాని ఆచరణకు నోచుకోవడం లేదు. విభజన సమయంలో ఇచ్చిన కుదురేముఖ ఉక్కు కర్మాగారం ఊసే లేకుండాపోయింది. మూడు ప్రభుత్వరంగ సంస్థలు కలిపి ఏర్పాటు చేయబోయే ఈ కర్మాగారంతో రాయదర్గం ప్రాంతంలో ప్రత్యక్షంగా మూడు వేల మందికి ఉపాది లభించి ఉండేది. కాని అధికార, ప్రతిపక్షాలేవి ఈ ప్రాజెక్టుపై పెదవి విప్పడం లేదు. సాగునీరు, పరిశ్రమలు అదనంగా రాకుండా రాయలసీమలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన అనంతపురం జిల్లా అభివృద్ధి ఏ మేరకు సాధ్యమన్న ప్రశ్నలు ఈ ప్రాంత మేధావుల నుంచి కూడా వ్యక్తమవుతున్నాయి. వీటికి అవసరమైన ప్రణాళికలను కూడా ప్రభుత్వం చేసిన దాఖలాల్లేవన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

స్పందనపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ బసంత్ కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 130 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని ఆదేశించారు. తిరిగి అర్జీలు రాకుండా చర్యలు తీసుకోవాలని పరిష్కరించిన వెంటనే ఫొటో తీసి నవశకం పోస్టులో అప్లోడ్ చేయాలన్నారు. దీనికి సంబంధించి అధికారులు కొందరు ఎన్నిసార్లు చెప్పిన తీరు మార్చుకోలేదని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ లు, ఈనెల ఆఖరుకు నిర్మాణాలు పూర్తి కావాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు కౌంటర్ ఫైల్ వేయాలని తహశీల్దారులను ఆదేశించారు. లోకాయుక్త కేసులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. గహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ భాగ్యరేఖ, డ్వామా పీడీ రామాంజనేయులు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సిపిఒ విజయ్ కుమార్, గహ నిర్మాణ శాఖ పీడీ నాగరాజు, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్, స్పందన తహశీల్దార్ గోపాలకష్ణ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజీఎం పాఠశాల ఆవరణంలో ఉన్నా భవిత వికలాంగుల పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, వార్డు కౌన్సిలర్ రమేష్‌కుమార్, బైసాని రాంప్రసాద్‌లు వికలాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆత్మవిశ్వాసంతో జీవించడంలో వికలాంగులకు ఎవరు సాటిరారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, పాఠశాల హెచ్‌ఎం లలిత, ఫిజియో థెరపిస్టు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి.పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ఎస్సీ ఎస్సీ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు బైటాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పది రోజులుగా తాము పలు వసతిగృహాలను పరిశీలించామని చెప్పారు. పలుచోట్ల భోజన వసతి సౌకర్యాలు సరిగా లేవని, బాత్ రూములు సక్రమంగా లేవని, ఫ్యానులు సరిగా లేవని విమర్శించారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మెస్, కాస్మోటిక్‌ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో భాగ్యరేఖకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కురుబ జగదీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి వినయ్ బాబు, నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా నాయకులు అభి, మురళి, గణేష్ చౌదరి, మూర్తి, ప్రకాష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న నాయకులు

ముస్తాబవుతున్న హేమావతి సిద్దేశ్వరస్వామి దేవాలయం

అమరాపురం : మండల పరిధిలోని హేమావతిలో గల పురాతన చరిత్ర కలిగిన సిద్దేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8న నిర్వహించనున్న లక్ష దీపోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ తెలిపారు. పురాతన చరిత్ర కలిగిన సిద్దేశ్వరస్వామి ఆలయంలో ఈ కార్యక్రమాన్ని 25 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నామని చెప్పారు.

వైసీపీ నేతల అక్రమాలకు అడ్డాగా రాష్ట్రం



స్థానికులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్



గ్రామంలో పర్యటిస్తున్న పరిటాల సునీత

ధర్మవరం టౌన్ : రేషన్, మద్యం, ఇసుక మాఫీయాలతో రాష్ట్రం వైసీపీనేతల అక్రమాలకు అడ్డాగా మారిందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆరోపించారు. పట్టణంలోని 5.6 వార్డులలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టగా అందుకు వస్తున్న జనాదరణ చూసి వైసీపీ నాయకుల్లో వణుకుపుట్టిందన్నారు. ఎక్కడ చూసిన ప్రజల ఇబ్బందులే కనిపిస్తున్నాయని ప్రజలు వైసీపీ పాలనతో విసిగిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, దేవరకొండ రామకృష్ణ, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, పరిశేసుధాకర్, భీమనేని ప్రసాద్ నాయుడు, రాంపురంశీన, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : రైతుల పొలాల్లో వైసిపి ప్రభుత్వం విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగిస్తే వాటిని ధ్వంసం చేయడానికి సిద్ధంగా ఉండాలని రైతులకు మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దమొగలయపల్లిలో సోమవారం నిర్వహించి ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె ప్రతి ఇంటికి వెళ్లి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని మొదలగుంట గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా వ్యాపారస్తులతో పాటు వీధి విక్రయదారులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదన్నారు. వీటిని ప్రభుత్వం నిషేదించిందన్నారు. దీనిని అతిక్రమించి, ఉత్పత్తి, దిగుమతి చేసుకునే వారికి మొదటి సారిగా రూ.50వేలు, రెండవ సారి దొరికితే రూ.1లక్ష జరిమాన విధించడంతో పాటు వారి అనుమతులను రద్దు చేస్తామన్నారు. ఉత్పత్తులు నిల్వచేసిన వ్యాపారస్తులకు, డిస్టిబ్యూటర్లకు మొదటి సారి రూ.25వేలు, రెండవ సారి రూ.50వేలు జరిమాన విదిస్తామన్నారు. వీధి వ్యాపారులకు మొదటి సారి రూ. 2.500, రెండవ సారి రూ.5వేలు జరిమాన విధిస్తామన్నారు. వాణిజ్య సంస్థలకు మొదటి సారి రూ.20వేలు, రెండవసారి రూ.40వేలు విధించడమే కాకుండా లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారం చేస్తామని, అయినప్పటికి వ్యాపారుల్లో మార్పు రాక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పవన్

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్యసాయి జిల్లాలో ఈనెల మూడున జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పవన్ కుమార్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో మొత్తం 19 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారని పవన్‌కుమార్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎస్ఎఫ్ఐ నాయకులకు విద్యార్థులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు.

బిసి మహాగర్జనను విజయవంతం చేయండి

తాడిమర్రి : విజయవాడలో బుధవారం జరిగే బిసి మహాగర్జన సభను విజయవంతం చేయాలని వైసిపి స్థానిక నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిసి మహాగర్జనకు మండలం నుంచి అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, కుంటాల పుల్లయ్య, చంద్రబాబు, మంజుల, నారాయణస్వామి, బిల్లేముత్యాలు, వెంకట వరద తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాలనడుమ భక్తరహళ్లి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -మడకశిర

మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి జిల్లడుగుంట ఆంజనేయస్వామి కంబాల లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలు అసౌకర్యాల నడుమ ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రేతర ప్రజలు కూడా అధికసంఖ్యలో హాజరవుతారు. మంగళవారం నుండి ప్రారంభం కానున్న ఈ బ్రహ్మోత్సవాలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, నిర్వాహకులు విఫలమయ్యారన్న విమర్శలు వినపడుతున్నాయి. లక్షల్లో ఆదాయం ఉన్నా ఆలయ అభివృద్ధి మాత్రం ఆమడదూరంలో నిలచిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా కనీస సౌకర్యాలైన నీరు, మరుగుదొడ్ల వసతి కల్పించడంలో విఫలమయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. భక్తులకు నీటి సౌకర్యం కల్పించే సింటెక్స్ కూడా సంవత్సరాల తరబడి శుభ్రపరచకపోవటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బ్రహ్మోత్సవాల సందర్భంగా కనీస సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గృహ నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలి

ఓబుల దేవర చెరువు : పక్కాగృహ నిర్మాణంలో ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ఏమాత్రం సరిపోవటం లేదని ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆపార్టీ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, మండల కార్యదర్శి చలపతి నాయుడు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పూల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు స్థానిక తహశీల్దార్‌కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నబాయ్, నరసింహులు, నారాయణ, రమణ, లక్ష్మీనరసు, కుళ్లాయమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి

రొద్దం : మండలంలోని చిన్నకోడిపల్లిలో కురుబలు కనకదాసు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్, మురళి, రొద్దకంపల్లి నాగరాజు, సురేష్, నంజుడప్ప, కరియన్న, ప్రభాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

ఓబుల దేవర చెరువు : మండలకేంద్రంలోని గ్రామకంఠం స్థలంలో నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ పుట్టపర్తి నియోజకవర్గ డివిజన్ కార్యదర్శి మున్నా మాట్లాడుతూ గ్రామ కంఠం భూమిలో నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని లేని పక్షంలో ఇల్లు లేని నిరుపేదలతో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు శివమ్మ, గౌస్‌పీర్, రామచంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సారవంతమైన భూముల్లో అధిక దిగుబడులు

నల్లమాడ : సారవంతమైన, ఆరోగ్యవంతమైన, భూముల్లో పంట సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎపిఎ సత్యనారాయణ, ఎ. సుమతి అన్నారు. ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన నేలలు, ఆహార భద్రత అంశాలపై వివరించారు. నేల కోతలు, మానవాళి చర్యల వల్ల భూమి పై పొర క్షీణిస్తోందన్నారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. విచక్షణ రహితంగా రసాయనిక ఎరువుల వాడకం అటవీ నిర్మూలన, ప్లాస్టిక్ వాడకం తదితర వాటితో నేల దెబ్బతింటుందన్నారు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయ విధానాల వల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చునన్నారు. రైతులు ప్రధానంగా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. భూమి సంపూర్ణ ఆరోగ్యవంతం కోసం ప్రతి ఏటా డిసెంబర్ 5న ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

పుట్టపర్తి రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ సోమవారం తన కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. కానిస్టేబుల్ నాగరాజు తాడిమర్రి పోలీస్ స్టేషన్ విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో మృతుని భార్య లలితకు రూ. 75వేల విలువజేసే చెక్కును అందజేశారు.

ఆ రెండు కంపెనీలపై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న వీటాక్, ఎటిది కంపెనీపై చర్యలు తీసుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి జగన్మోహన్, హరినాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇస్తామని పేరుతో ఈ కంపెనీలు వారి శ్రమను దోచేస్తున్నారని విమర్శించారు. ఆ రెండు కంపెనీల్లో దాదాపు 90 మంది దాకా సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. అందులో పని చేస్తున్న ఉద్యోగులందరికి 25 వేల రూపాయల వేతనంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

తలుపులలో పర్యటించిన వైసిపి సిఇసి సభ్యులు

తలుపుల : వైసిపి సిఇసి సభ్యులు పూలశ్రీనివాసరెడ్డి మండలంలో సోమవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని పులిగిల్లపల్లిలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం రమణ నూతన గృమ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓబుల్ రెడ్డి పల్లిలో ఆనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ ఆర్ఐ పాపిరెడ్డిని పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన కారం మహబూబ్ బాషా అనారోగ్యంతో బాధపడుతుండటంతో పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శంకర్, యూత్ అధ్యక్షులు ఉత్తరెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు కొండారెడ్డి, మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

రబీ విత్తన వేరుశనగ పంపిణీ

నల్లచెరువు : మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామ సచివాలయం పరిధిలోగల రైతు భరోసా కేంద్రంలో సోమవారం రబీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీని ఎంపిపి రమణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విత్తన వేరుశనగ కావలసిన రైతులు తమ యొక్క భూమి వివరాలు, సెల్ ఫోన్, విద్యుత్ పంపుసెట్టు కరెంట్ బిల్లుతో సంబందిత రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఎంపీటీసీ రమణారెడ్డి, మాజీ సర్పంచి సూర్యనారాయణ రెడ్డి, ఆర్‌బికె సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

చేపలపెంపకానికి చెరువు వేలం

సోమందేపల్లి : మండల పరిధిలోని నాగినేని చెరువు పంచాయతీ పరిధిలోని చెరువులు, చింతమానుల వేలం పాటను సోమవారం స్థానిక సర్పంచి అంజి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి నాగరాజురావ్, కార్యదర్శులు వాసంతి, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి

కదిరి టౌన్ : పూర్తి అయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే స్వాధీనం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ సమీపంలోని గట్ల వద్ద గత ప్రభుత్వ హాయంలో నిర్మించిన జి ప్లస్ త్రీ టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న ఇళ్లకు ప్రస్తుతం ఇస్తున్న లక్ష ఎనబై వేల రూపాయలు ఏమాత్రం సరిపోదని ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి కాలనీలో రోడ్లు, తాగు నీరు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి మధు నాయక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, పవన్, సిపిఐ నాయకులు ముబారక్, కమల్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

చిలమత్తూరు : స్థానిక డివిఅండ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సులలో చదువుతున్న మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఒజెటి) శిక్షణను స్థానిక గ్లోబల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్‌లో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా 100 మంది విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించారు. వత్తివిద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చి నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగేంద్ర, రంగారెడ్డి, విజయ్ హరిబాబు, కమలాక్షమ్మ, రమణ, గ్లోబల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ఛైర్మన్ నాగేంద్ర, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘర్షణలు రేపుతున్న ఎమ్మెల్యే అనుచరులు : చిలకం

ధర్మవరం టౌన్ : ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే అనుచరులు అణగారిన వర్గాల మధ్య చిచ్చులు పెడుతూ వారి మధ్య గొడవలు సృష్టిస్తున్నారని భవిష్యత్తులో వారికీ ఇలాంటి పరిస్థితులు రాకతప్పవని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జనసేన నాయకులను ఆయన పరామర్శించి వైద్యఖర్చుల కోసం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామంలో వైసీపీ నాయకులు జనసేన పార్టీనాయకులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఇలాంటి దాడులకు చేయడం మానుకోకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి దాసరి రామాంజినేయులు, సీనియర్ నాయకులు లింగాల ప్రకాశ్ రెడ్డి, బత్తలపల్లి మండలం కన్వీనర్ జ్వాలాపురం శెట్టిరవి, నాయకులు పేరూరుశ్రీనివాసులు, కోటికా రామాంజి పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకే మరో నాటకం

ప్రజాశక్తి - పెనుకొండ

ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకే మహాగర్జన పేరుతో వైసిపి మరో నాటకం ఆడుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈరోజు రాయలసీమ నిజంగా గర్జించే స్థితిలో ఉందా అని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లాలో అమర్ రాజా కంపెనీ , కడపలో ఉక్కు పరిశ్రమ, అనంతపురంలో జాకి,కీయా అనుబంధ సంస్థలు వెళ్లిపోయినందుకా సీమగర్జన అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రమౌళి, శ్రీరాములు, సూర్యనారాయణ, ప్రసాద్, సోమశేఖర్, త్రివేంద్ర నాయుడు, సుబ్రహ్మణ్యం, వాసుదేవరెడ్డి, గయప్ప తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై గ్రామస్తుల నిరసన



అధికారితో మాట్లాడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని చాల్లాపల్లిలో సచివాలయ ఏర్పాటుకు స్థల సేకరణ విషయంలో అధికారుల తీరుకు ఆ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళకు దిగారు. తహశీల్దార్ కార్యాలయంలో కింద కూర్చొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచికి తెలపకుండా రెవెన్యూ సిబ్బంది, మండల సర్వేయర్ వచ్చి గ్రామంలో ఎలాంటి ఆధారం లేని అనాధ మహిళ స్థలంలో సచివాలయ భవన నిర్మాణానికి కొలతల వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామకంఠం భూమిలో సచివాలయం ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామ కంఠం భూమిని ఒక ప్రతిపక్ష నాయకుడు ఆక్రమించుకున్నాడని ప్రజా ఉపయోగాలకు ఉపయోగించాల్సిన ఆ భూమిని కాపాడవలసిన రెవిన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సర్పంచి భర్త దామోదర్, ఉపసర్పంచ్ కె నరేష్ కుమార్, సత్యనారాయణ రెడ్డి, బాబి రెడ్డి, గంగాధరప్ప, శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి, అంజన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం కబ్జా

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు

ప్రజాశక్తి గోరంట్ల

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వెనుక వైపు ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. సర్వే నెంబర్ 271/2 లో మూడు ఎకరాలు ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని 2010లో లేఅవుట్ వేశారు. అయితే స్థానిక వైసీపీ నాయకుడి అండతో స్వార్థపరులు కోట్లాది రూపాయలు విలువగల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. వైసిపి నాయకులు దగ్గరుండి జెసిబి తో పునాదులు వేయిస్తున్నారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో ఈ స్థలంలో ఆర్మీ జవాన్లకు పట్టాలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంతో తమ స్థలాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆర్మీ జవాన్ మధుసూదన్ రెడ్డి సోమవారం స్థానిక తహశీల్దార్ రంగనాయకులకు వినతి పత్రం అందజేశారు అలాగే నరసింహులు అనే వ్యక్తి తనకు 2013లో ఇంటి పట్టా మంజూరైందని అయితే ప్రస్తుతం ఆస్థలంలో దౌర్జన్యంగా పునాదులు వేస్తున్నారని తన స్థలానికి రక్షణ కల్పించాలని బాధితుడు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు స్థలం భూ కబ్జాపై తహశీల్దార్ రంగనాయకులును వివరణ కోరగా కార్యాలయం సెలవు రోజు ఆదివారం నాడు ప్రభుత్వ స్థలంలో జెసిబి తో పునాదులు వేశారని ఆ స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మార్కెట్లోకి ఇండియన్ గ్యాస్ ఫైబర్ సిలిండర్లు

ప్రజాశక్తి ముదిగుబ్బ



సిలిండర్ పంపిణీ పత్రాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

మండల కేంద్రంలోని దొరిగిల్లు రోడ్ లో గల కార్తికేయ ఇండియన్ గ్యాస్ కార్యాలయంలో ఫైబర్ స్మార్ట్ గ్యాస్‌సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఇండియన్ గ్యాస్ సేల్స్ మేనేజర్ రవి మోహన్ రెడ్డి ఆయన మాట్లాడుతూ 10 కేజీల ఫైబర్ స్మార్ట్ గ్యాస్ సిలిండర్ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. మహిళలు సులభంగా తీసుకెళ్లవచ్చని చెప్పారు. అంతేకాకుండా సిలిండర్‌లో గ్యాస్ ఎంతుందో చూసి తెలుసుకోవచ్చన్నారు. ఈ ఫైబర్ స్మార్ట్ గ్యాస్ సిలిండర్ తో ప్రమాదాలు కూడా జరగవని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ ఇండియన్ గ్యాస్ నిర్వహకులు మల్లికార్జున రెడ్డి,కార్యాలయ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

11న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఈనెల 11వ తేదీన రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, రామకృష్ణ, కోశాధికారి జయసింహ, క్యాంపు ఛైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు సోమవారం సాంస్కృతిక మండలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి దాతలుగా మామిళ్ళ వెంకటరమణమ్మ జ్ఞాపకార్థం వారి భర్త మామిళ్ళ రంగనాయకులు, వారి కుమారులు, రవాణా సౌకర్యం దాతగా ఉలక్కిరెడ్డి కుమారుడు కె. రామచంద్రారెడ్డి అతని మిత్రబృందం వ్యవహరించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గట్టు హరినాథ్, సుదర్శన్ గుప్తా, నాగభూషణ, సోలిగాల వెంకటేశు, సత్రశాల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లి ఎస్సీ కాలనీ, బోయ వీధిలో ఏపీ కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీస్ కోటి సుధ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచులు ఆక్కిం నారమ్మ,కోటి గోపీనాథ్, ఎంపీ టీసీ కోటి నరేష్ కుమార్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లరు, సేల్స్ మెన్లుకు వేతనాలు పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

మహిళా గొర్రెల కాపరి దారుణహత్య

పుట్టపర్తి రూరల్ : మండలం పరిధిలోని చెర్లోపల్లి అటవీ ప్రాంతంలో గొర్రెల కాపరి నాగమ్మ (54) దారుణ హత్యకు గురైంది. చెర్లోపల్లికి చెందిన నాగమ్మ యథావిధిగా సోమవారం గొర్రెలను మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను బండరాళ్ల తో మోది హత్య చేశారు. గ్రామానికి చెందిన కేశవ భార్య చింతకాయల నాగమ్మ ప్రతి రోజు లాగే కూడా గొర్రెలను మేత కోసం అడవికి తీసుకెళ్లింది. భార్య భర్తలు ఇద్దరు అడవికి వెళ్ళే వారు. కానీ ఇతర పనులకు పట్టణానికి వెళ్లిన కేశవ ఆలస్యంగా వెళ్లాడు. అటవీ ప్రాంతంలో రక్త గాయాలతో విగతజీవిగా పడి ఉన్న తన భార్య మృతదేహాన్ని గుర్తించిన కేశవ గ్రామస్తులకు పోలీసులకు సమాచారం అందించారు. ధర్మవరం డీఎస్పీ, పుట్టపర్తి రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గుడిబండ : గుడిబండ గ్రామానికి చెందిన సురేంద్రప్ప (55) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తుమ్మల మారమ్మ దేవాలయం సమీపంలో ఓ చింత చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేంద్రప్ప బేల్దారు పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండేవాడు. కడుపునొప్పితో బాధపడుతున్న సురేంద్రప్ప నొప్పికి తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం ఎగువపల్లి గ్రామంలో యల్లమ్మ దేవాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన రూ.50501లు అందజేశారు. ఈ మొత్తాన్ని ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్ ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈశ్వరయ్య, ఎంపిటిసి శివకుమార్, డీలర్ కుమార్, టెంపుల్ డైరెక్టర్ గరుడప్ప, ఎస్టీ సెల్ కృష్ణనాయక్, శ్రీనివాసులు, సోమశేఖర్ రెడ్డి, గంగాధర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

అమరాపురం : మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. విరపసముద్రం, పుల్లికుంట, హలుకురు, ఆలదపల్లి, బసవనపల్లి, హేమావతి, కెంకెర, నిద్రఘట్ట తదితర గ్రామాల్లా హనుమ జయంతిని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.

భూ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రసాద్

హిందూపురం : హిందూపురం రూరల్, పట్టణ భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా భూములను రీసర్వే చేసి, నిజమైన హక్కుదారులకు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకు ప్రత్యేక డిప్యూటి తహశీల్దార్‌గా ప్రభుత్వం తనను నియమించిందన్నారు. అందుకు అనుగుణంగా భూములను రీసర్వే చేసి ఎటువంటి వివాదం లేకుండా, నిజమైన హక్కుదారులకు భూ హక్కు పత్రాలను అందించడానికి కృషి చేస్తామన్నారు.

డిగ్రీ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు ప్రారంభం

హిందూపురం : బిఎ, బికాం, బిఎస్సీ. కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎన్ఎస్‌పిఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి సోమవారం తెలిపారు. మూడు విడతల్లో నిర్వహించిన ఆన్‌లైన్ అడ్మిషన్లలో ప్రవేశం పొందలేకపోయిన విద్యార్థులు నేరుగా కళాశాల వద్ద సంప్రదించి వివిధ కోర్సుల్లో చేరడానికి ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించిందన్నారు. రూ. 400 ప్రవేశ రుసుము చెల్లించి, ఈ నెల 5 వ తేదీ నుంచి 7 వ తేదీ వరకు సర్టిఫికెట్ల అప్లోడ్, స్క్రూటినీ చేయించుకోవాలని చెప్పారు. వంద రూపాయల అపరాధ రుసుముతో 8, 9 తేదీల వరకు అవకాశం ఉంటుందని ప్రిన్సిపల్ తెలిపారు.

ఓబుళరెడ్డిపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్

తలుపుల : మండల పరిధిలోని ఓబుల్ రెడ్డి పల్లి గ్రామ సచివాలయంలో డాక్టర్ మన్వర్‌బాషా ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి డయాబెటిస్ హైపర్ టెన్షన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రేగాటిపల్లి సొసైటీ భూములను పరిరక్షించండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణ సమీపంలోని రేగాటిపల్లి సొసైటీ భూములను పరిరక్షించాలని జనసేన నాయకులు అధికారులను కోరారు. సొసైటీ భూములను రైతులకు పట్టాలు, ఎలాంటి పరిశ్రమలకు ఇవ్వకూడదని వీటిని కేవలం ఇంటి పట్టాలకే మాత్రం ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు పత్రాలను అధికారులకు సోమవారం అందజేశారు. ఈ మేరకు నాయకులు హైకోర్టు ఉత్తర్వులను జిల్లాకలెక్టర్ బసంత్‌కుమార్, ఆర్డీవో తిప్పేనాయక్, తహశీల్దార్ నీలంకంఠారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి రామాం జనేయులు, పేరూరు శ్రీనివాసులు, కోటికి రామాంజి, బండ్ల చంద్రశేఖర్, దాడితోట లక్ష్మయ్య, నాయుడునాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పమాలాధారులకు భోజన సౌకర్యం

గోరంట్ల : పట్టణంలో సరస్వతీ విద్యా మందిరం సమీపాన గల అయ్యప్ప స్వామి దేవాలయంలో ఎరుకల సంఘం మండల అధ్యక్షులు టిడిపి నాయకులు ఎల్ఎన్ నారాయణస్వామి ఆధ్వర్యంలో 800 మంది అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప టిడిపి నాయకురాలు సబితమ్మ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, టౌన్ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో రాయలసీమకు ద్రోహం : కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరోమారు రాయలసీమకు దగా చేస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతం నుంచి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారని ఆయన హాయాంలో రాయలసీమకు తీరని ద్రోహం జరుగుతోందని అన్నారు.కడప ఉక్కు రాయలసీమ హక్కు అని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాలు అయినాకడప ఉక్కు గురించి మాట్లాడడం గాని పరిశ్రమ ఏర్పాటు కోసం కృషి చేయడం గానీ చేయడం లేదని విమర్శించారు. ప్రస్తుతం రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు తెరపైకి తీసుకొచ్చి ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం యువత ఉపాధి కోసం ఏ ఒక్క పరిశ్రమమైన తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి తద్వారా లబ్ధి పొందాలని వైసిపి చూస్తోందని అన్నారు. ప్రజలు వీటన్నిటిని గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మోపురిశెట్టి చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ దాదెం శివారెడ్డి, తెలుగు యువత నాయకులు గంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా దూదేకుల సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-హిందూపురం

నూర్‌భాషా దూదేకుల సంక్షేమ సంఘం పట్టణ నూతన కమిటీని నియోజకవర్గ అధ్యక్షులు సుభాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మౌలాలి, ఉపాధ్యక్షులుగా కుళ్లాయప్ప, చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా అల్లీపీరా, యువజన కమిటీ అధ్యక్షులుగా షేక్షావలి, ఉపాధ్యక్షులుగా షఫివుల్లా, ప్రధాన కార్యదర్శిగా మహబూబ్‌బాషా, కార్యదర్శిగా అల్లబకాష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ఖాసీంతో పాటు కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులు

పచ్చదనం పెంపునకు ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి జిల్లాను గ్రీన్ జిల్లాగా తీర్చిదిద్దడానికి విరివిగా మొక్కలు ప్రతి ఒక్కరూ నాటాలని కలెక్టర్ బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు సూపర్ స్పెషాలిటీ సమీపంలోని శ్రీ బ్రహ్మకుమారి ఆశ్రమ ఆవరణలో ఆరోగ్యవనం మన లక్ష్యం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 5వ తేదీని ప్రపంచ మత్తిక దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. మానవాళికి ఆహారంలో 95 శాతాన్ని నేల అందిస్తుందని చెప్పారు. ఐదు శాతం సముద్రాలు నదులు మొదలైన వాటి నుంచి లభిస్తుందన్నారు. ప్రపంచ భూభాగంలో మూడో వంతు అడవులే ఉన్నాయన్నారు. 80 శాతం జీవవైవిధ్యం అడవుల్లోనే ఉందన్నారు. అందుకే ఏ దేశానికి ఆదేశం కూడా తమ భూభాగంలో మూడో వంతు అడవి ఉంటే పర్యావరణం సమతుల్యం సాధ్యమవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారని తెలిపారు. జిల్లాలో అటవీవిస్తీర్ణం సుమారు 14 శాతం ఉందన్నారు. జాతీయ అటవీపాలసీ 1980 ప్రకారం 33 శాతం గ్రీన్ కవర్ పెంచాలంటే కొండలు, గుట్టలు, ప్రస్తుతం ప్రభుత్వ ఇస్తున్న ఇంటి స్థలాలు, ప్రభుత్వం ప్రాధాన్తిస్తున్న భవన నిర్మాణాలు, బంజర భూములు, దేవాదాయ భూముల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. అందరి సహకారంతో దశలవారీగా రాబోయే రెండు సంవత్సరాల్లో జిల్లాలో కోటిమొక్కలు నాటే కార్యక్రమానికి ప్రణాళికలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఎంఏ పీడీ రామాంజనేయులు, వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపి అధికారి సుదర్శన పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి : పదవ తరగతిపైన చదువులు చదివిన ప్రతి ఒక్కరూ ధర్మవరంలో నిర్వహించే జామ్మేళాను సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బత్తలపల్లిలో స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో జాబేళా పోస్టర్లును సోమవారం శ్రీసత్యసాయి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్ . ఖయ్యూం, ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ తేజ్ వరుణ్ రెడ్డితో కలిసి విడుదల చేశారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అనంతపురం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త వెంకటేశ్వరరావుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల రామ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కలవల రాంకుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం పట్టణంలోని క్లాక్ టవర్ సమీపంలో దుకాణం నడుపుతున్న ఆర్యవైశ్య వ్యాపారి వెంకటేశ్వరరావుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ దష్టికి తీసుకెళ్ళి బాధితులకి న్యాయం జరిగేంత వరకు జిల్లాఆర్యవైశ్య సంఘం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా కార్యదర్శి నల్లపేట ఆదర్శ కుమార్, కోశాధికారి రేపాకుల సురేష్ పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి అమానుషం

పుట్టపర్తి అర్బన్ : చిత్తూరు జిల్లా పుంగనూరులో పారిశ్రామికవేత్త, సంఘ సేవకుడు రామచంద్ర యాదవ్ ఇంటిపై వైసీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని ఆ సంఘం నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు లక్ష్మీ నరసప్ప యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ సంఘటనను ఖండిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు వరప్రసాద్ యాదవ్, దయ్యాల ఉమాపతి యాదవ్, సాయినాథ్ యాదవ్, రాజశేఖర్ యాదవ్, పాలు డైరీ వెంకటేష్ యాదవ్, రామాంజనేయులు యాదవ్, సాయి ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కమిటీకి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ సమీపంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలోని నిత్య అన్నదాన కమిటీకి మాజీ మార్కెట్ యార్డుఛైర్మన్ కొండూరు మల్లికార్జున విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన సోమవారం రూ.10వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకుమార్, అన్నదాన కమిటీ నిర్వహకులు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం : టిడిపి



పెనుకొండలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తనకల్లులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కొత్తచెరువులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెనుకొండ : జగన్ రెడ్డి పాలనలో బిసిలకు అన్యాయం జరుగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహసీల్దార్ స్వర్ణలతకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి హుజురుల్లా ఖాన్, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, జిల్లా సాధికార యాదవ అధ్యక్షులు కేశవయ్య, మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ అధ్యక్షులు రవి శంకర్, మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి సాయి ప్రసాద్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామలింగ, పట్టణ మహిళా అధ్యక్షురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గరపడ్డాయ్ : వైసీపీ జయహో బీసీ సభ అంటూ కల్లిబొల్లి మాటలతో నిర్వహిస్తుంటే, ఇటు పుంగనూరులో మంత్రి గా వున్న పెద్దిరెడ్డి బీసీ నేతలని అంతమొందించే కుతంత్రాలు చేస్తున్నారని టీడీపీ జిల్లా బీసీ సాధికార కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరాములు యాదవ్ విమర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పుంగనూరుకు చెందిన పారిశ్రామికవేత్త,సమాజ సేవకులు రామచంద్రయాదవ్ ఇంటి పై వైసీపీ మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వానికి చమరగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు.

కొత్తచెరువు : వైసిపి ప్రభుత్వ హయాంలో బీసీలకు ఎలాంటి ప్రాధాన్యత లభించలేదని సత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండ్లపల్లి రాజు విమర్శించారు.కొత్త చెరువులో టిడిపి బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. అనంతరం తహశీల్దార్ రామాంజనేయ రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డిపో భాస్కర్, కోడపగానిపల్లిశివ, సకల సుబ్బరాయుడు, శంకర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : వైసిపి హయాంలో బిసిలకు అన్యాయం జరుగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చర్యల కారణంగా బిసిలు ఆర్థిక సామాజిక రాజకీయంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జయచంద్ర, రేణుక బాయ్ , శంకర్ రెడ్డి, పీట్ల సుధాకర్, అంజనప్ప, మైనార్టీ నాయకులు షాను, ఎ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: వైసిపి బిసిల ద్రోహి అని టిడిపి మండల కన్వీనర్లు రామాంజనేయులు,విజయ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గాండ్లపెంట : బిసి సబ్ ప్లాన్ నిధులను వైసిపి ప్రభుత్వం పక్కదారి పట్టించిందని తెలుగుదేశం మండల కన్వీనర్ సి కొండయ్య, మాజీ సర్పంచి ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, పవన్ కుమార్, ఆంజనేయులు నాయక్, నరసింహులు, రవి తదితరులు పాల్గొన్నారు

తనకల్లు : బిసిల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, నాయకులు బీగం శంకర్ నాయుడు, సోంపాళ్యం నాగభూషణ, నాగేంద్రప్రసాద్, జియావుల్లా, ఓబులేసు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : బిసిల హక్కులను వైసిపి ప్రభుత్వం హరిస్తోందని టిడిపి నాయకులు విమర్శించారు. టిడిపి మండలకన్వీనర్ సిద్ద లింగప్ప ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బోర్ గోపాల్, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, మాజీ సర్పంచి నారాయణ, నాగరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : వైసిపి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరుగుతోందని టిడిపి నాయకులు, బిసి నాయకులు విమర్శించారు. ఈమేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రంగనాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరిధర్ గౌడ్, అశ్వర్థ రెడ్డి, జయరాం, వేణుగోపాల్, చంద్ర, దేవాంగం శ్రీనివాసులు, తెలుగు యువత నరేష్ యాదవ్, నరేంద్ర రాయల్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : బడుగు బలహీన వర్గాలకు టిడిపి ప్రభుత్వం తోనే అభ్యున్నతి సాధ్యమవుతుందని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు సోమవారం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో బీసీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా తహశీల్దార్ నటరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మల్‌రెడ్డి, నాయకులు పల్లపు రవీంద్ర, మంజునాథ్, సామ కోటేశ్వరయ్య, కేశవ నాయుడు, జంగం వెంకట్రాముడు, పాల్గొన్నారు.

అమడగూరు : రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధిని విస్మరించిందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ నాయకులు తిరుపాల్, నాయకులు రమణ, రామచంద్ర, కిష్టప్ప, స్టూడియో మూర్తి, శ్రీనివాసులు, శీన, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.